
# ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ

సుకుమార్ మంచి ప్రతిభ ఉన్న రేడియో మెకానిక్. స్వాతంత్ర్యం రాక ముందు మనదేశంలో రేడియోలు ఉత్పత్తి అయ్యేవి కావు. విదేశాల నుంచి దిగుమతి అయిన సెట్లే మార్కెట్లో ఉండేవి. వాటి కనీస ధర ఐదువందల రూపాయలపైనే ఉండేది. అందువల్ల కేవలం సంపన్నులు, మధ్యతరగతిలో ఉన్నత వర్గం వారూ మాత్రమే వాటిని కొనుక్కోగలుగుతుండేవారు. ఆరోజుల్లో రేడియో ఉన్నవాడు ధనికుడి కిందే లెక్క. ఆ రోజుల్లో ఫర్వాలేదు కానీ స్వాతంత్ర్యం వచ్చాక, పోనుపోను దిగుమతులమీద ఆంక్షలు ఎక్కువ అవడంతో వాటి స్పేర్ పార్ట్స్ దొరకడం మానేశాయి. దాంతో రిపేరు వచ్చిందంటే చాలా సెట్లు మూలపడేవి. అటువంటి మొండి రేడియోలను రిపేర్ చేయడం సుకుమార్‌కి ప్రత్యేక హాబీ. ఆరోజు సుకుమార్ తన వర్క్‌షాప్‌లో చాలా బిజీగా ఉన్నాడు. ఆ చిన్న గదిలో ఎన్నెన్నో రకాల రేడియో సెట్లు చిన్నవీ, పెద్దవీ, స్వదేశానివీ, విదేశాలవీ, ట్రాన్సిస్టర్‌లు, టు ఇన్‌వన్‌లు, స్టీరియోలు ఒకటేమిటి అన్ని రకాలవి ఉన్నాయి. కాబినెట్లు ఊడదీసినవి కొన్నీ, తీయనివి కొన్ని వివిధ ఆకారాలలో ఉండడంతో ఆ గది రేడియో ఆస్పత్రిలాగా ఉంది.

సుకుమార్ ఒక పెద్ద రేడియో సెట్‌ని పరీక్షిస్తున్నాడు. అది ఎన్నో ప్రత్యేకతలు కలిగి, అతి బలహీనమైన వేవ్ లెంగ్త్‌లను కూడా బలంగా పట్టుకోగలిగిన శక్తిమంతమైన ఎంతో ఖరీదైన విదేశీ సెట్. అది ఒక మాజీ నవాబుగారిది. ప్రత్యేక వస్తువులను కొనడంలో ప్రత్యేక హాబీగల ఆ నవాబుగారు దానిని ప్రాణప్రదంగా చూసుకుంటుంటారు. కాలప్రభావంతో దానికేరోగం వచ్చినా, మూలపడేయడానికి ఆయన మనసొప్పలేదు. సుకుమార్ పేరువిని దానిని బాగుచేయడానికి అతని దగ్గరకు పంపించాడు. ఆ రేడియో గుర్రు గుర్రుమంటోంది. ఇండికేటర్ ఐదో బాండ్‌లో ఉంది. దానిని నెమ్మదిగా తిప్పుతున్నాడు సుకుమార్. ఇండికేటర్ ఒక చోటికి వచ్చేసరికి ఆ గుర్రు శబ్దంలోంచి ఒక తీరులో వస్తున్న శబ్ద పరంపర అతి నెమ్మదిగా వినిపించసాగింది. నిశితమైన సుకుమార్ చెవులు ఆ బలహీనమైన శబ్దాలను పసికట్టగలిగాయి. అవి అంతకుముందు ఎప్పుడూ విన్న శబ్దాలు కావు. ఆశ్చర్యం పట్టలేకపోయాడు. టైం చూశాడు. 9.30 అయింది. కిటికీలోంచి బయటకు చూశాడు. నల్లని ఆకాశం మీద తెల్లని చుక్కలు చాందినీకి కట్టిన పాదరసం బుడ్లవలె ధగధగా మెరుస్తున్నాయి. ఆ కృష్ణపక్షమి రాత్రి చాలా ప్రశాంతంగా ఉంది. వెంటనే టేప్ రికార్డర్



ఆన్ చేసి ఆ శబ్దాలను రికార్డు చేయడం మొదలుపెట్టాడు. పక్కనే ఉన్న నోట్‌బుక్‌లో టైము నోట్‌చేసి ఆ ప్రసారం గురించిన వివరాలు అతిక్లుప్తంగా రాసుకున్నాడు. తిరిగి అతి శ్రద్ధగా ఆ శబ్దాలను వినడం మొదలుపెట్టాడు. అతని ముఖం ఉద్వేగంతో నిండిపోయింది.

విజయానంద్ నెమ్మదిగా ఆ గదిలో అడుగుపెట్టాడు. మిత్రుడు సుకుమార్ భుజం మీద నెమ్మదిగా చేయి వేశాడు "ఏమిటి అంత సీరియస్‌గా ఉన్నావు?" అంటూ.

ఉలిక్కిపడి వెనక్కి చూశాడు సుకుమార్. ఆనంద్‌ని చూస్తూ మాట్లాడవద్దన్నట్లు ముక్కుమీద వేలేసుకుని సంజ్ఞ చేశాడు. సంగతి గ్రహించిన విజయానంద్ మారు మాట్లాడకుండా తాను కూడా శబ్దాలను శ్రద్ధగా ఆలకించడం మొదలుపెట్టాడు.

కొంచెం సేపట్లో ఆ శబ్దాల ప్రసారం ఆగిపోయింది. అది పూర్తిగా ఆగిపోయిందని నిర్ధారణ చేసుకుని టైం చూసి, తిరిగి బుక్‌లో నోట్ చేశాడు సుకుమార్. ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు.

"ఏమిటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?" అన్నాడు విజయానంద్.

"రేడియోలో విచిత్రమైన శబ్దాలు వచ్చాయి. నువ్వు వచ్చేసరికి వాటినే నేను వింటున్నాను. నువ్వు కూడా విన్నావేమో!" అన్నాడు సుకుమార్.

"లేదు. నేను చివరలో వచ్చాను. అందువల్ల సరిగా వినలేదు అన్నాడు విజయానంద్.

సుకుమార్ వెంటనే టేప్ రికార్డర్‌లోని టేప్‌ని రివర్స్ చేసి ఆ తర్వాత ఆన్ చేశాడు. వాల్యూమ్‌ని మాక్సిమంకి పెంచాడు. అంతకుముందు రేడియోలోవిన్న శబ్దాలు తిరిగి రాసాగాయి. అవి అయిపోగానే "ఇవేమిటో నువ్వు చెప్పగలవా!" అని అడిగాడు సుకుమార్.

"ఇదేమీ భాషలాగా లేదు. ఒకవేళ ఏదైనా భాషే అయితే నాకు తెలిసినంత వరకూ ఈ భూప్రపంచంలో ఇటువంటి భాషేమిలేదు" అన్నాడు విజయానంద్. అతను వృత్తిరీత్యా శాస్త్రవేత్త అయినా ప్రవృత్తిరీత్యా భాషా శాస్త్రం మీద ఉన్న ప్రత్యేక అభిమానం వల్ల ప్రపంచంలోని ఇంచుమించు ప్రతి భాషనీ అంతోఇంతో పరిశోధించి పరిచయం ఏర్పరచుకున్నాడు.

"అవును. నువ్వు చెప్పింది నిజం. ఇది భాష కాదు. మన ప్రపంచంలోనే కాదు మరే లోకంలోనూ కూడా మాట్లాడే భాష కాదు" అన్నాడు సుకుమార్.

"మరి!" ప్రశ్నార్థకంగా చూశాడు విజయానంద్.

"ఇవి మరేదో లోకంలోని బుద్ధి జీవులు మన భూమికి ప్రత్యేకంగా పంపిస్తున్న సంకేతాలని నాకు అనిపిస్తోంది. ఈ సంకేతాల ద్వారా వారు తమ ఉనికిని మనకు తెలియజేస్తున్నారని నా అనుమానం" అన్నాడు సుకుమార్ ఆలోచిస్తూ.

పరలోకవాసులు పంపిస్తున్నారని ఎలా అనుకోడం! భూమి మీద నుంచే ఎవరో పంపిస్తుం డొచ్చుగా!" అన్నాడు విజయానంద్.

"నిజమే. మన భూవాసుల సంకేతాలు వేరుగా ఉంటాయి. పైగా ఈ వేవ్‌లెంగ్త్‌లో భూమి మీద ఏ స్టేషన్ నుంచీ ప్రసారాలు జరగవు. నిజానికి ఇటువంటి శబ్దాలను నేను మొదటిసారిగా ఎనిమిది సంవత్సరాల కిందట విన్నాను. అప్పుడే నేను వీటిని సుదూరలోకాల నుంచి వస్తున్న వాటివిగా అనుమానించాను. అవి ఫలానా నక్షత్ర మండలం నుంచి వస్తున్నాయని కూడా ఒక నిర్ధారణకు వచ్చాను. దానిని ధ్రువ పరచుకోవడానికి ఒక ప్రయోగాన్ని చేశాను. నా అనుమానమే కనుక నిజమైతే ఈ ఏడాది ఇదేరోజుల్లో తిరిగి అట్టి సంకేతాలే వస్తాయని ఊహించాను. నా ఊహ నిజం అయింది. నవాబ్‌గారి ఈ రేడియో చాలా శక్తిమంతమైంది. అందుకే వీటిని సులువుగా పట్టగలిగింది. ఆ... ఇవే సంకేతాలు ఇంకా పదిరోజులు వస్తాయి" అన్నాడు సుకుమార్ ఆనందోద్వేగంతో ఊగిపోతూ.

"అరే! ఎంత విచిత్రం! మరి నాక్కూడా నువ్వెప్పుడూ చెప్పలేదే!" అన్నాడు విజయానంద్ ముప్పిరి గొన్న ఆశ్చర్యంతో.

"ఎలా చెప్తాను! అప్పటికి మన స్నేహం ఏర్పడందే" అన్నాడు సుకుమార్ నవ్వుతూ.

"అది సరే. వాళ్లు భూవాసుల కోసమే ఈ సంకేతాలు పంపుతున్నారని ఎలా చెప్పగలవు? మరేలోకం వారి కోసమైనా కావచ్చుగా! ఈ విశాల విశ్వంలో మానవకోటి ఉన్నలోకం మనది ఒకటే కాదుకదా!" అన్నాడు విజయానంద్.

"నిజమే. కాని ఇది మనకోసమేనని నిక్కచ్చిగా చెప్పగల ఆధారాలున్నాయి. ఏమంటే ఈ సంకేతాలు

ఇరవై నాలుగు గంటలకొకసారి వస్తున్నాయి. అంటే వారికి మన దినపరిమాణం 24 గంటలని తెలుసునన్నమాటేగా! ఐతే అంగారక గ్రహం మీద కూడా దినప్రమాణం ఇరవై నాలుగు గంటలే కదాని నువ్వు అడగవచ్చు. కానీ మన భూమిని గురించి బాగా తెలుసుకున్నవారికి భూమి మీద మాత్రమే బుద్ధి జీవులు ఉన్నారనీ, అంగారకుని మీద లేరని తెలియడంలో వింతలేదు. అందుకే ఇది ఖాయంగా భూవాసులకోసమేనని చెప్పవచ్చు. మరి ఇవి ఎక్కడ నుంచి వస్తున్నాయన్న అనుమానం సహజంగా వస్తుంది. నా అనుమానం ప్రకారం ఇవి మనకి అత్యంత సమీపంలో ఉన్న ఆల్ఫా సెంటారీ నక్షత్ర మండలానికి చెందిన గ్రహం నుంచి వస్తున్నాయి".

"బాగుంది! నీ అనుమానికి ఆధారమేమిటి? నువ్వేదో ప్రయోగం చేశానన్నావు. అదేమిటి?" అని కుతూహలంతో అడిగాడు విజయానంద్.

"మనకి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్ర మండలం ఆల్ఫా సెంటారీ శాస్త్రజ్ఞుల అనుమానం ప్రకారం ఇది సరిగ్గా మన సౌర మండలాన్ని పోలి ఉంటుంది. ఈ మండలంలో ఉన్న ప్రాక్జిమా సెంటారీ నక్షత్రానికి అన్ని విధాలా మన భూమిని పోలిన గ్రహాలు ఉన్నాయట. అక్కడ మానవులను పోలిన అమితమైన అభివృద్ధిని సాధించిన బుద్ధి జీవులు ఉండవచ్చుననివారి అనుమానం. మన భారతీయ శాస్త్రజ్ఞులలో కొందరు మనం చెప్పుకునే విశ్వామిత్ర సృష్టి ఇక్కడే జరిగిందని భావిస్తున్నారు. బహుశా అక్కడి బుద్ధి జీవులు మన భూమి మీద నాగరికత సాధించిన మానవాళి ఉన్నట్లు గుర్తించి ఉండవచ్చు. అందుకనే వారు రేడియో తరంగాల ద్వారా మనతో సంబంధాల పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండవచ్చు. అయితే వీరి భాష మనకి తెలియదు. అందువల్ల భాషతో నిమిత్తం లేకుండా మనం అర్థంచేసుకోగల సంకేతాలను వారు పంపుతుండాలి. కాని అవి నిత్యమూ పంపడం సాకేంతికంగా సాధ్యమూ కాదు. అవసరమూ లేదు. పైగా నిరంతరంగా పంపితే అవి బుద్ధి జీవులు ఉద్దేశపూర్వకంగా పంపుతున్న సంకేతాలని గుర్తించడం కష్టం. కనుక వారు అనుకూలమైన కాలంలో నిర్ణీత పద్ధతిలో అర్థం చేసుకోగల విధంగా పంపుతుండినవి కనుక ఇవి తప్పక అల్ఫా సెంటరీ నక్షత్ర మండలం నుంచి వచ్చినవే అని నిర్ధారించాను" అని కొంచెం ఆగాడు సుకుమార్.

"సరే. మరి నువ్వు చేసిన ప్రయోగమేమిటి?" అని అడిగాడు విజయానంద్.

"అదే చెప్పబోతున్నా. ఆల్ఫా పెంటారీ నక్షత్ర మండలం నాలుగు కాంతి సంవత్సరాల దూరంలో ఉందన్న విషయం తెలిసినదేగా. అంటే సెకనుకి ఒక లక్షా ఎనభై ఆరువేల మైళ్ళ వేగంతో ప్రయాణం చేసే కాంతి, అక్కడ నుంచి మనకు రావడానికి నాలుగు సంవత్సరాలు పడుతుందన్నమాట. కనుక వారి సంకేతాన్ని అర్థం చేసుకున్నట్లుగా తెలియజేయడానికి వారి సంకేతాన్నే తిరిగి ప్రసారం చేస్తూ మరొక విధమైన సంకేతాన్ని జోడించి పంపాను. అది వారు అర్థం చేసుకుంటే ఆ విషయం తెలియజేయడానికి నా సంకేతాన్ని అనుకరిస్తూ మరో సంకేతం ఈ సమయంలో పంపుతారని ఊహించాను. అయితే నా సంకేతం వారికి చేరడానికి నాలుగేళ్ళు తిరిగి వారి ప్రతి సంకేతం రావడానికి మరో నాలుగేళ్ళు మొత్తం ఎనిమిదేళ్ళు పట్టింది. నిజానికి ప్రతిసంవత్సరం ఈ సమయంలో వారి సంకేతాలు వస్తూనే ఉన్నాయి. కానీ వారి జవాబు అందడానికి ఎనిమిదేళ్ళు అవసరం కనుక ఈ సంవత్సరం మాత్రమే నా సంకేతాన్ని అనుకరించిన సంకేతం వచ్చింది. కనుక నా ఊహ అక్షరాలా నిజమైందన్న మాట" అంటూ ఆనందంతో ఉప్పొంగి పోయాడు సుకుమార్..

'నీ మేధాశక్తికి నా జోహార్లు' అని ఆనందంతో మిత్రుని ఆలింగనం చేసుకున్నాడు విజయానంద్.

"వారు కొన్నివేల కోటానుకోట్ల మైళ్ళ దూరం నుంచి సంకేతాలు పంపగలుగుతున్నారంటే వాళ్ళు అత్యున్నతంగా వికాసం చెందిన బుద్ధిజీవులన్నమాట. కాని నువ్వు అంతటి దూరంలో ఉన్న ఆ నక్షత్రమండలానికి ఏ విధంగా రేడియో తరంగాలు పంపగలిగావు" అని అడిగాడు విజయానంద్.

"లేజర్ కిరణాలు అత్యంత శక్తిమంతమైనవన్న విషయం నీకు తెలిసినదే కదా! అటు తర్వాత హైడ్రోజన్ వాయువు అత్యల్ప పరిమాణంలోనైనా కూడా ఈ అనంత విశ్వం అంతా ఆవరించి ఉంది. అందువల్ల ఈ వాయువును మీడియంగా ఉపయోగించి లేజర్ కిరణాలను రేడియో తరంగాల రూపంలో పంపితే అవి ఈ విశ్వాంతరాళంలో ఎంతటి దూరానికైనా చొచ్చుకు పోగలవు. అటువంటి తరంగాలను ప్రసారం చేయగల యంత్రాన్ని రూపొందించ గలిగాను" అన్నాడు సుకుమార్ సగర్వంగా.

విజయానంద్ ఆనందానికి అవధిలేదు.

"నాకు తెలుసు సుకుమార్. నువ్వు బ్రతుకు తెరువు కోసం ఈ రేడియో రిపేర్ షాపు పెట్టుకున్నా నీలోదాగిఉన్న శాస్త్రజ్ఞుడు నీ చేత కొత్త కొత్త విషయాలు కనిపెట్టిస్తూనే ఉంటాడు. నిజానికి ఇది వర్క్‌షాపు కాదు. నీలేబొరేటరీ. ఇంతకాలం నేను కేవలం వృత్తిరీత్యా శాస్త్రజ్ఞుడిని మాత్రమే. ఇంకముందు నీకు చేదోడువాదోడుగా ఉండి నీతోపాటు కొత్తకొత్త విషయాలు కనిపెట్టడంలో సహకరిస్తాను". అన్నాడు ఆవేశంగా.

అంతకంటేనా! నీవంటి మేధావి సహాయం నాకు లభిస్తే దివిలోని చుక్కల్ని భూమికి రాల్చుమా!" అన్నాడు సుకుమార్. మరి కాసేపటికి ఇంటికి వెళ్ళిపోయాడు విజయానంద్.

సుకుమార్ మంచి స్వీయప్రతిభ గల మేధావి. ఎన్నెన్నో శాస్త్రీయ విషయాలలో పరిశోధనలు జరిపి ఎన్నో కొత్త విషయాలు కనుగొన్నాడు. ఎన్నెన్నో కొత్తపరికరాలు రూపొందించాడు. అతనికి ఖగోళశాస్త్రం అంటే ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. అతని పరిశోధనలు ఎంతో విలువైనవైనా పెరటి చెట్టు మందుకు పనికిరాదన్నట్లు స్వదేశంలో అతనికి గుర్తింపు కరువైంది. కాని అతనికి విదేశ శాస్త్రవేత్తల నుంచి పరిశోధనా సంస్థలనుంచి మంచి ప్రోత్సాహం లభిస్తుండడంతో నిరాశ పొందక స్వదేశంలోనే పరిశోధనలను కొనసాగిస్తూ వస్తున్నాడు. తీరిక సమయంలో రేయింబవళ్ళనక తన వర్క్‌షాప్‌ని అంటివెనకనే ఉన్న లేబరేటరీలో తన పరిశోధనలను జరుపుకుంటుంటాడు.

సుకుమార్ కనుగొన్న విషయం ప్రపంచమంతటా పెద్ద సంచలనాన్ని రేపింది. అతని జీవిత విశేషాలను ఫోటోలతో సహా ప్రచురించని పత్రిక ప్రపంచంలో లేదంటే అతిశయోక్తి కాదు. వెంటనే ఆతడు 'పుట్టినదేశం' సుకుమార్ మావాడు అని లోకానికి చాటి చెప్పింది. పరిస్థితిలో వచ్చిన మార్పుని చూసి నవ్వుకున్నాడు సుకుమార్.

ఎప్పుడైతే తనకి ప్రపంచ ప్రఖ్యాతి లభించిందో, తాను ఏ నాటినుంచో కలలుకంటున్న విశ్వాంతరాళ యాత్రకి రూపకల్పన చేయాలని అనుకున్నాడు సుకుమార్. వెంటనే ప్రపంచంలోని ప్రముఖ పత్రికలన్నింటికీ. తాను ఆల్ఫాసెంటారీనక్షత్ర మండలానికి వెళ్ళి సజీవంగా తిరిగి రాగలననీ, అది సఫలం కావడానికి తనకి ఆర్థిక సహాయం చేయమనీ ప్రపంచ ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. దానికి ప్రతిస్పందిస్తూ అభివృద్ధి చెందిన దేశాల నుండి, వ్యక్తుల నుంచీ సంస్థలనుంచీ కూడా అతనికి భూరివిరాళాలు అందడం మొదలు పెట్టాయి.

దానితో రెట్టించిన ఉత్సాహంతో తన పరిశోధనలను ముమ్మరం చేశాడు సుకుమార్. విజయానంద్ సుకుమార్‌కి అన్ని విధాలా సహాయకారిగా ఉంటున్నాడు. అయితే రేడియో తరంగాలనైతే ఆల్ఫా సెంటారీకి పంపగలిగాడే కాని, కాంతికే నాలుగు సంవత్సరాలు పట్టే ఆ సుదూర ప్రయాణాన్ని భౌతికంగా చేయడం ఎలాసాధ్యం అన్న అనుమానం అతన్ని పీడించసాగింది. కాని మిత్రుని శక్తి సామర్థ్యాల మీదున్న అచంచల విశ్వాసంతో పైకిమాత్రం ఏమీ అనలేదు.

ఆనాడు విజయానంద్ మామూలుగా సుకుమార్ లేబొరేటరీకి వెళ్ళాడు. గత కొన్ని రోజులుగా సుకుమార్ వర్క్‌షాప్ పని పూర్తిగా మానేసి పూర్తికాలం తన లేబొరేటరీ పరిశోధనలలోనే గడుపుతున్నాడు. అలికిడి వినగానే తలఎత్తి చూశాడు. ఆనందం పట్టలేక "విజయ్, విజయం సాధించాను. కనిపెట్టేశాను" అంటూ విజయానంద్‌ని గాఢంగా కౌగిలించుకుని ఉషారుగా అరుస్తూ గిరగిరా తిప్పడం మొదలుపెట్టాడు.

"అరె... ఏమిటి సంగతి? త్వరగా చెప్పు" అని విజయానంద్ అడుగుతున్నా వినిపించుకోకుండా కొంతసేపు అలాగే గంతులు వేసి, ఆ తర్వాత ఆవేశంతో చెప్పసాగాడు సుకుమార్.

"విజయ్.... మనం ఆల్ఫా సెంటారీకి వెళ్ళిరావచ్చు. అందుకు సాధనం కనిపెట్టేశాను." అన్నాడు ఆనంద పారవశ్యంతో.

'అసంభవం.... కాంతివెళ్ళి రావడానికే ఎనిమిది సంవత్సరాలు పడుతుందే. మరి మనకి అదెలా సాధ్యం?" అన్నాడు విజయానంద్.

" అంటే ఈ సుకుమార్ శక్తి సామర్థ్యాల మీద నీకు పూర్తి నమ్మకం లేదన్నమాట. ఒక్క ఆల్ఫా సెంటారీయే ఏమిటి? ఇంకా వందల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్ర మండలాలకు కూడా మనం వెళ్ళిరావచ్చు" అన్నాడు సుకుమార్.

సుకుమార్‌కి పిచ్చెక్కలేదు కదా అన్న అనుమానం వచ్చింది విజయానంద్‌కి.

ఆ అనుమానపు చూపులు గమనించి "వాని పిచ్చిమాటలు కావు విజయ్. నిజమే చెప్తున్నాను. మనం కాంతి వేగంతో ప్రయాణం చేస్తాం" అన్నాడు సుకుమార్.

"అసంభవం. ఐన్‌స్టీన్ సూత్రం ప్రకారం ఏ పదార్థమూ కాంతి వేగాన్ని అందుకోలేదు. ఆ సూత్రం తప్పుకావడానికి వీలులేదు" అన్నాడు విజయానంద్ బుర్రగోక్కుంటూ.

"ఐన్‌స్టీన్ సూత్రం తప్పని నేననలేదే. ఆ సూత్రం ప్రకారమే మనం వెళ్ళగలమంటున్నా" అన్నాడు సుకుమార్.

"అదెలా సాధ్యం?" అని గొణిగాడు విజయకుమార్.

"ఇలా" అంటూ ఒక పెట్టె తెరిచాడు సుకుమార్.

"మ్యావ్" అంటూ ఒక పిల్లికూన బయటకు వచ్చింది. దానిని మళ్ళీపెట్టెలో పెట్టి మూతవేశాడు సుకుమార్. ఆపెట్టెకున్న స్విచ్‌లు ఏవో ఆన్‌చేశాడు. వెంటనే మళ్ళీ మూతతీశాడు. అందులో పిల్లిలేదు!

ఆశ్చర్యంతో కొయ్యబారి పోయాడు విజయానంద్.

"కొంచెం దూరంలో ఉన్న మరొక పెట్టెమీదున్న స్విచ్‌లు మళ్ళీ వేశాడు సుకుమార్. ఈ సారి ఆ

పెట్టెమూత తీశాడు అందులోంచి మ్యావ్ అంటూ అదే పిల్లికూన బయటకు వచ్చింది.

విజయానంద్ సంభ్రమాశ్చర్యాలకు అంతులేదు. అది కలో కనికట్టో తెలియలేదు అతనికి. కొంచెం తెప్పరిల్లాక "మ్యాజిక్ ఎప్పుడు నేర్చావు?" అని అడిగాడు.

"మ్యాజిక్ కేవలం మెజిషియన్ మాత్రమే చేయగలడు. ఇది మ్యాజిక్ కాదు. నూటికి నూరుపాళ్ళు వాస్తవం. నీ చేతులతో నువ్వే చేసిచూడు." అంటూ తాను చేసినదంతా విజయానంద్ చేత చెప్పి చేయించాడు సుకుమార్.

విజయానంద్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

చాలా విచిత్రంగా వుంది కదూ. ముందు నేనూ నమ్మలేకపోయాను. నేను చేసింది సిద్ధాంత రీత్యా సాధ్యమేనని నాకు తెలిసినా ప్రయోగపూర్వకంగా అది సాధ్యపడుతుందనుకోలేదు. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం పదార్థాన్ని శక్తిగానూ, శక్తిని పదార్థంగానూ మార్చవచ్చునన్న విషయం తెలిసిందేగా! నేను రూపొందించిన ఈ యంత్రం ద్వారా పిల్లి శక్తిగా మారిపోయింది. మళ్లీ అదేవిధంగా ఇదే యంత్రం ద్వారా శక్తి పిల్లిగా మారిపోయింది. రేడియోలోను, టెలిఫోన్‌లోను మనం మాట్లాడిన మాటలు ఏవిధంగా విద్యుచ్ఛక్తిగా మారి, తిరిగి ఆ విద్యుచ్ఛక్తి మనం మాట్లాడిన పద్ధతిలోనే ఏ విధంగా శబ్దంగా మారుతుందో అదే పద్ధతిలో పదార్థం శక్తిగానూ, ఆ శక్తి తిరిగి పదార్థాంగానూ మారిపోయాయి. కనుక శక్తిగా మారిపోయిన ఈ పదార్థం కాంతివేగంతో ప్రయాణం చేయగలదు. ఇదే సూత్రాన్ని ఉపయోగించి మనం మనల్ని శక్తిగా మార్చుకుని విశ్వాంతరాళంలో విజయవిహారం చేసి, కావాలనుకున్న గ్రహాలమీద వాలి తిరిగి మానవరూపం పొంది ఆ తర్వాత మళ్లీ కావాలనుకున్నప్పుడు శక్తిరూపంలో మన భూమిని జేరి తిరిగి మనుష్యులుగా మారవచ్చు" అంటూ ఒక్క బిగిన చెప్పుకుపోయాడు సుకుమార్.

"అద్భుతం...పరమాద్భుతం" నీ పరిశోధన ప్రపంచ చరిత్రనేకాక దాని గతినే మార్చివేస్తుంది. ఈ అద్భుత విజయానికి నిన్నెలా అభినందించాలో తెలియడంలేదు. అంతా బాగానే వుంది. కాని ఇక్కడ నువ్వున్నావు కనుక శక్తిని తిరిగి పదార్థంగా మార్చి పిల్లికి అసలు రూపం మళ్ళీ తెచ్చావు. అదే మనం నక్షత్ర మండల యాత్ర చేస్తుంటే మన రూపం మనకి తిరిగి ఎవరు ఇస్తారు" అని సందేహాన్ని వెలిబుచ్చాడు విజయానంద్.

అది ఏమీ సమస్యే కాదు. ఈ కంప్యూటర్ యుగంలో సమాధానం దొరకని సమస్య ఉండదు. ఆటో మేటిక్ కంట్రోల్ వల్ల ముందుగానే టైం సెట్ చేసి నిర్ణీత సమయానికి మన రూపం మనకు వచ్చేట్లు చేసుకోవచ్చు. లేదా గ్రౌండ్ కంట్రోల్‌లో ఉన్న మన శాస్త్రజ్ఞులు దీనిని సులువుగా నిర్వహించగలరు.

"ఓ...ఇంక అల్ఫా సెంటారీ ప్రయాణమొక్కటే తరువాయన్నమాట. అది తలచుకుంటేనే నా ఒళ్లు ఆనందంతో ఉప్పొంగిపోతోంది. ప్రయాణం ఎప్పుడా అని ఉవ్విళ్లూరుతున్నాను" అన్నాడు ఆనంద్.

"అవును. సిద్ధంగా ఉండు. కాని అక్కడి సృష్టి. మానవాళి ఎలా ఉంటుందో మనకి తెలియదు. బహుశా మన భూమి మీది సృష్టిలాగా ఉండకపోవచ్చు. వారి రూపాలను మన కళ్లు గుర్తించలేకపోవచ్చు. వారి శబ్దాలను మన చెవులు వినలేకపోవచ్చు. కనుక వాటిని గుర్తించగల యంత్రాలను రూపొందిస్తున్నాను. ఇవి పూర్తి కాగానే మనం ప్రపంచ వ్యాప్తంగా ప్రకటించి ప్రయాణానికి సిద్ధపడవచ్చు" అన్నాడు సుకుమార్.

"వెరీగుడ్.. ఇంక నేను వెళ్ళి వస్తాను" అని సెలవు తీసుకున్నాడు విజయానంద్.

కొద్దిరోజుల్లోనే తన పరిశోధనా ఫలితాలను సైన్స్ కాంగ్రెస్ ముందుంచాడు సుకుమార్. వాటిని నిశితంగా పరిశీలించి విశ్వాంతరయానం సాధ్యమేనన్న అతని అభిప్రాయంతో ఏకీభవించారు. వారు ఆ శాస్త్రజ్ఞులతో ఒక సంఘం ఏర్పాటు చేయబడింది. వారు సుకుమార్, విజయానంద్‌లను 'ఆల్ఫాసెంటరీ' నక్షత్ర మండలానికి పంపే ఏర్పాటు చేయడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. అందుకు కాగల ఖర్చుని భరించడానికి అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అనేక దేశాలు ముందుకు వచ్చాయి, అందుకు కావలసిన సన్నాహాలు చురుకుగా ప్రారంభమయ్యాయి. ఈ వార్తలతో ప్రపంచం అంతా అట్టుడికి పోయింది. ఎవరినోట విన్నా ఈ వింత సంగతుల గురించి చర్చలే.

* * * *

మరికొన్ని నెలల్లోనే ఆల్ఫాసెంటారీ యాత్రకి ఏర్పాట్లన్నీ పూర్తి అయినాయి. దీనికి 'ఆపరేషన్ ఆల్ఫాసెంటారీ" అని పేరు పెట్టారు శాస్త్రజ్ఞుల బృందం. గ్రౌండ్ కంట్రోల్ అత్యాధునిక యంత్రాలను అమర్చింది. వీటిని ప్రముఖ శాస్త్రవేత్తలు పర్యవేక్షిస్తున్నారు.

మరికొంత సేపట్లో సుకుమార్, విజయానంద్‌లు ప్రత్యేక దుస్తులతో వచ్చారు. పట్టరాని ఆనందంతో అభినందనలు తెలుపుతున్న ప్రజాసమూహానికి శాస్త్రవేత్తలకీ వీడ్కోలు చెప్పి నౌకలోకి ప్రవేశించారు వారిద్దరూ.

మరికొంచెం సేపట్లో గ్రౌండ్ కంట్రోల్‌లోని యంత్రాలు పనిచేయడం మొదలుపెట్టాయి. మరుక్షణంలో నౌక స్థానంలో ఒక పెద్ద మెరుపు మెరిసింది. ఉత్తర క్షణంలో ఆ మెరుపు కూడా మాయమైపోయింది. ఆ నౌక అందులోని సామగ్రి సుకుమార్, విజయానంద్‌లతో సహా కాంతిగా మారిపోయి, కాంతివేగంతో విశ్వాంతరాళంలోకి చొచ్చుకుపోసాగింది. దాని గమనాన్ని గ్రౌండ్ కంట్రోల్‌లోని శాస్త్రజ్ఞులు శ్రద్ధగా గమనించసాగారు. అంతా సవ్యంగా సాగుతుండడంతో వారి మనసులు సంతృప్తితో నిండిపోయాయి.

* * * *

నాలుగు సంవత్సరాలు గడిచాయి. అంతరిక్ష నౌక తన గమ్యం చేరుకుంటోంది. కాంతి ప్రసారంగా సాగిపోతున్న ఆ నౌక గమనాన్ని భూమి మీదున్న గ్రౌండ్ కంట్రోల్ దాని శక్తిమంతమైన యంత్రాలు గ్రహించగలుగుతున్నాయి. అది ఉద్దేశించిన తీరులో సాగిపోతుండడంతో 'ఆపరేషన్ ఆల్ఫా సెంటారీ' ప్రయోగం విజయవంతమవుతుందన్న విశ్వాసం శాస్త్రజ్ఞులలో కలిగింది. వారి ఆనందోత్సాహాలకి అవధిలేదు.

అంతరిక్ష నౌక 'సెంటారీ' ఆల్ఫా సెంటారీనక్షత్ర మండల పరిధిలోకి ప్రవేశించింది. సూర్యునికి భూమి ఉన్నంతటి ఇంచుమించు దూరంలోనే ప్రాగ్జిమా సెంటారీ నక్షత్రానికి (ఆల్ఫా సెంటారీ నక్షత్ర మండలంలో ఉన్న నక్షత్రాలలో ప్రాక్జిమా సెంటారీయే భూమికి అత్యంత సమీపంలో ఉన్న నక్షత్రం. ఇది సూర్యుని పోలి ఉంటుంది) భూమికి కవల అన దగ్గ గ్రహం ఒకటుంది. దీని మీదా వాతావరణం, నదులు, సముద్రాలు, మంచు, ప్రాణికోటి అన్నీ ఉన్నాయి. ఆ గ్రహపు ఆకర్షణ వలయంలోకి ప్రవేశించగానే, కంప్యూటర్‌లో ముందుగా చేసుకున్న ఏర్పాటు ప్రకారం, కాంతి రూపంలో సాగిపోతున్న సెంటారీ నౌక స్వరూపం పొందిన యాంత్రిక నౌకగా మారిపోయింది. దానితోపాటు సుకుమార్, విజయానంద్‌లకు ఎప్పటి సజీవ రూపం వచ్చేసింది. వెంటనే వారు అంతరిక్ష నౌకను తను అధీనంలోకి తీసుకున్నారు. నౌక

కిటికీలోనుంచి వారు బయటకు చూశారు. ఎటు చూసినా ఆకాశం నల్లగా ఉంది. దాని మధ్య నక్షత్రాలు పాల ముంజెల్లా మెరుస్తూ వ్రేలాడుతున్నాయి. తమ దగ్గరున్న ఛార్టుని చూసి భూమితో సహా సౌరమండలంలో ఉన్న పాలపుంత నక్షత్ర మండలాన్ని (మిల్కీవే గాలాక్సీ), సూర్యునీ గుర్తించగలిగారు.

మరొకవైపు వారు చేరుకోబోతున్న గ్రహం అంతకంతకూ పెద్దదవుతూ కనిపిస్తోంది. నౌకలోని యంత్రాలు ఆ గ్రహపు స్వరూప స్వభావాలను తెలియజేస్తున్నాయి. అది ఇంచుమించు భూమిలాగానే ఉండడమే కాకుండా దాని వాతావరణ పీడనం, స్వభావం కూడా ఇంచుమించు భూమిపై వాటిని పోలి ఉన్నాయి. కాకపోతే ఆ గ్రహం మీద జలభాగం, భూభాగం ఇంచుమించు సమానంగా ఉన్నాయి. ఉన్నతమైన పర్వతాలు కొన్ని స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరికొన్ని పర్వత శిఖరాలు సముద్రంలో నుంచి పైకి పొడుచుకు వచ్చి ద్వీపాలలాగా అనిపిస్తున్నాయి.

సెంటారీ ఆ గ్రహానికి బాగా చేరువయింది. దానిమీద వృక్షజాలం కనిపిస్తోంది. కాని అది భూమి మీద లాగా పచ్చగా లేదు. కాలిన బూడిద రంగులో ఉంది. ఆ కొండల మధ్య చదునైన ప్రదేశాన్ని చూసుకుని అక్కడ నౌకను దింపాడు సుకుమార్.

"ఏమిటీ వృక్షజాలం! చాలా విచిత్రంగా ఉంది. ఇవన్నీ మురికి గాజుతో చేసినట్లున్నాయి" అన్నాడు విజయానంద్ వాటివంక చూస్తూ.

సుకుమార్ వాటిని పరీక్షించడానికి ఒక కొమ్మ విరిచి చూశాడు. మన భూమి మీద ప్రాణికోటి అంతా 'కార్బన్ సైకిల్'తో ఏర్పడింది. సిలికాన్ ధాతువు మూలంగా కూడా జీవజాలం ఏర్పడే అవకాశం ఉందని మన శాస్త్రవేత్తలు అనుమానిస్తూ వచ్చారు. వారి ఊహ నిజమేనని ఇప్పుడు తెలుస్తోంది. ఇవన్నీ సిలికాన్ సైకిల్ ద్వారా ఏర్పడిన వృక్షాలు. ఈ లెక్కన ఇక్కడి జంతువులు, మనుషుల రూపాలు కూడా చాలా విచిత్రంగా అసలు మనం గుర్తుకూడా పట్టలేనట్లుగా ఉన్నా ఆశ్చర్యపోనక్కరలేదు అన్నాడు సుకుమార్.

ప్రశ్నార్థకంగా అతని వంక చూశాడు విజయానంద్.

"అవును నిజమే! ఎందుకంటే కాంతి ప్రసారంలో మన కన్ను చూడగలిగింది. కేవలం ఏడు శాతమే. ఏ పదార్థమైనా దానిమీద పడే కాంతిలో ఎక్కువ భాగాన్ని హరించుకుని కొంత భాగాన్ని మాత్రమే తిరిగి ప్రసారం చేస్తుంది. ఈ కాంతి మన కన్ను గుర్తించగలిగినదైతే ఆ పదార్థపు రూపు రేఖలను మనం చూడగలుగుతాం. ఇక్కడి వస్తువులు, జీవ జాలం దీనికి భిన్నమైన కాంతిని ప్రసారం చేస్తే మనం వాటిని చూడలేం. ఉదాహరణకి ఈ వస్తువులు ఎక్స్‌రేలను ప్రసారం చేస్తే వాటిని మన కళ్లు గుర్తించలేవు కనుక ఎదుటనే వున్నా ఆ వస్తువులు మనకు కనిపించవు" అంటూ వివరించాడు సుకుమార్.

"అబ్బా" అంటూ ఉన్నట్లుండి ముందుకు పడ్డాడు విజయానంద్. "ఏమైంది" అంటూ ఆదుర్దాగా అడిగాడు సుకుమార్.

"ఎవరో నన్ను బలంగా గుద్దుకున్నారు" అన్నాడు విజయానంద్ లేస్తూ.

"అయితే నా అనుమానం నిజమేనన్నమాట. మనం ఇక్కడి మనుషులను చూడలేం. అలాగే వారు కూడా మనల్ని చూడలేకపోయుండవచ్చు. ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ హడావుడిగా నౌకలోకి వెళ్లి ఒక రకమైన బైనాక్యులర్స్‌ని తీసుకువచ్చాడు సుకుమార్.

అందులోంచి చూస్తూ "ఇదిగో చూడు. కొంచెం దూరంలో ఈ లోకపు మనుషులు ఎలా తిరుగుతున్నారో!" అంటూ బైనాక్యులర్స్‌ని విజయానంద్‌కి ఇచ్చాడు.

విజయానంద్ ఉత్సాహంగా దానిలోంచి చూడసాగాడు. కొంచెం దూరంలో ఒక నగరం కనిపిస్తోంది. విచిత్రమైన భవనాలు, వింత ఆకారంలో వున్న మనుష్యులూ, ఆకాశంలో విచిత్ర రూపాల్లో ఎగురుతున్న పక్షులూ, దూరంగా వింత వింత ఆకారాలలో తిరుగాడుతున్న జంతువులు అంతా పరమాద్భుతం మహాద్భుతంగా ఉండి అతన్ని నిశ్చేష్టున్ని చేశాయి. కొంచెం ముందు ఒక వ్యక్తి పరుగెట్టుకు పోతున్నాడు.

"ఆ....అతనే నన్ను గుద్దుకుని ఉంటాడు" అని అరిచాడు. సుకుమార్ నౌకలోకి తిరిగి వెళ్లి అటువంటిదే మరో బైనాక్యులర్ తీసుకువచ్చాడు. దానిలోంచి చూస్తూ "అవును. అలాగే ఉంది. అతను భయపడి పోయి పరుగిడుతున్నట్లున్నాడు. బహుశా నువ్వు అతనికి కనిపించి ఉండవు. అందుకే వెళ్తూ వెళ్తూ నిన్ను గుద్దేశాడు. దాంతో భయపడిపోయి ఈ వింత సంఘటన గురించి తనవారికి చెప్పడానికి వెళ్తున్నట్లున్నాడు. కనుక ఏ ప్రమాదమూ రాకముందే ఇక్కడినుంచి మరోచోటికి పోదాం" అంటూ దారి తీశాడు సుకుమార్.

దారిలో"'మనం వారిని చూడగలిగేటట్లు ఎలా చేశావు' అని అడిగాడు విజయానంద్.

"ఏముంది. ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుచ్ఛక్తిని ఎక్కువగానూ, తక్కువగానూ కావలసిన విధంగా మనం మార్చేసుకోవడంలేదా. అలాగే ఈ బైనాక్యులర్స్‌లోని అద్దాలు ఇక్కడి వస్తువులు ప్రసారం చేసే వేవ్‌లెంగ్త్ లను మన కళ్ళు గుర్తించగల వేవ్‌లెంగ్త్‌లకు మారుస్తాయి. అందువల్ల దీనితో మనం ఇక్కడి వాటిని చూడగలం" అంటూ విశదీకరించాడు సుకుమార్.

"ఫైన్ అయితే ఒక అనుమానం ఇక్కడి మనుష్యులనీ, జంతువులనీ, ఇతరవస్తువులనీ చూడలేకపోతున్నాం. కాని చెట్లని చూడగలిగాం. ఇదెలా సాధ్యం?" అని అడిగాడు విజయానంద్.

"ఏముంది సింపుల్, మన భూమి మీద చెట్లనే చూడు. అవి ఆకుపచ్చగా ఉంటాయి. ఎందుకని వాటిలో క్లోరోఫిల్ ఉంటుంది కనుక. మరి మనుష్యులకీ జంతువులకీ క్లోరోఫిల్ ఉండదుకనుక అవి పచ్చగా ఉండవు. అంటే వృక్ష నిర్మాణానికి జంతు నిర్మాణానికీ మౌలికమైన తేడా ఉందన్నమాట. అలాగే ఇక్కడి చెట్లు సిలికాన్‌తో ఏర్పడ్డాయి. సిలికాన్ ప్రసారం చేసే కాంతిని మనకళ్ళు గుర్తించగలవు. అందుకే వాటిని చూడగలిగాం" అని వివరించాడు సుకుమార్.

మరికొంచెం సేపట్లో వారు నగరం పొలిమేరలకు చేరుకున్నారు. అక్కడ కొందరు మనుష్యులు వస్తూపోతున్నారు. వారి రూపాలు కూడా ఇంచుమించు మనుష్యుల రూపాలనే పోలిఉన్నాయి. అయితే పొట్టిగా ఉన్నారు. వారు ఏదో మాట్లాడుకుంటున్నట్లు వారి పెదవులు కదులుతున్నాయి, కానీ శబ్దాలు మాత్రం వినిపించడంలేదు.

"ఊ" అంటూ తలపంకించాడు సుకుమార్. జేబులోంచి రెండు చిన్న డబ్బీలవంటి వాటిని తీసి చెవుల్లో పెట్టుకున్నాడు. అలాగే మరో రెండింటిని తీసి విజయానంద్‌కి ఇచ్చాడు. ఉత్తరక్షణంలో ఆ మనుష్యులు మాట్లాడుకుంటున్న మాటలు, నగరం లోని రణగొణ ధ్వని, పక్షులు జంతువుల అరుపులూ, అన్నీ స్పష్టంగా వినిపించసాగాయి. అయితే వారి భాష అర్థం కాలేదు.

"ఏమిటీ వింత?" అని అడిగాడు విజయానంద్.

"ఏముందీ" ఇక్కడ ఉత్పన్నమవుతున్న శబ్దాలన్నీ మనం వినలేని అల్ట్రాసోనిక్స్, అంటే వినిపించని శబ్దాలు. శబ్దం ఫ్రీక్వెన్సీ సుమారు ఇరవైవేల తరంగాలను దాటితే మన చెవులు వినలేవు కదా! ఇవి అటువంటివన్నమాట. ట్రాన్స్‌ఫార్మర్‌లోలాగానే వినిపించని ఈ అల్ట్రాసోనిక్స్‌ని మనం వినగలిగేటట్లుగా మారుస్తుంది మన చెవుల్లోని యంత్రం" అన్నాడు సుకుమార్. వారు నగరం వంక చూస్తూ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వెనకాల నుంచి బలమైన 'హస్తాలు ఇద్దరినీ ఒకేసారి పట్టుకున్నాయి. భయంగా ఒక్కసారి అరచి ఇద్దరూ వెనక్కి చూశారు. బైనాక్యులర్స్‌లోంచి ఆ లోకం వాసుల చేతుల్లో తాము చిక్కడం. వెనకాల నుంచి ఎందరో మనుష్యులు తండోపతండాలుగా వస్తుండడం కనిపించింది. తాము మిత్రులమనీ, శత్రువులు కామనీ తెలిసేటట్లు రకరకాల భంగిమలు చేశాడు సుకుమార్, కానీ వారికి అవేమీ అర్థమయినట్లు లేదు. తమవంక వింతగా చూస్తూ వారిలో వారు వింతగా నవ్వుకుంటున్నారు. వారి చేతుల్లో అద్దాలవంటివి ఏవో ఉన్నాయి. వాటిలోంచి వారు తమని చూస్తున్నారు. అంటే ఆ అద్దాలు కూడా తమ బైనాక్యులర్స్ వంటివన్నమాట.

కొద్ది నిమిషాలకు వారు సుకుమార్‌ని, విజయానంద్‌నీ తీసుకువెళ్ళి ఒక మ్యూజియం వంటి దానిలో వారిని బోనుల్లో ఉంచారు. కొంచెం దూరంలో వారి నౌకను ఉంచారు. తర్వాత వెళ్ళిపోయారు.

వీరు బాగా అభివృద్ధి చెందిన బుద్ధిజీవులు. మరి మన పట్ల ఇంత అనాగరికంగా ప్రవర్తిస్తున్నారేమిటో!" అన్నాడు విజయానంద్ బాధగా.

"అది సహజమే, చీమలు, తేనెటీగలు ఎంతో అభివృద్ధి చెందిన జీవాలు. వాటిలో కూడా మనుషులను పోలిన సంఘనిర్మాణం ఉంది. వాటిలో రాజులు, రాణులు, బానిసలు, ఉంటాయి. వారికి కేటాయించిన విధులే కాక ఆఖరికి వర్గ వ్యవస్థ కూడా ఉంది మనుషుల్లో లాగానే. అయినా మనం వాటిని హీనంగా చూడడంలేదూ. అలాగే మనకన్నా ఎన్నోరెట్లు అన్నివిధాలా అభివృద్ధి చెందిన వీరి కంటికి మనం అల్పజీవాల్లాగా కనిపిస్తుండడంలో ఆశ్చర్యం లేదు. ఒక వేళ చీమలు, తేనెటీగలు మనతో మాట్లాడాలని ప్రయత్నాలు చేసినా, సంకేతాలు పంపినా మనకి అర్థం కాదు. పట్టించుకోం. ఎందుకంటే వాటికీ మనకి అంతటి అంతరం ఉంది. కనీసం మనం వాటి భావాలను అర్థం చేసుకునే ప్రయత్నం కూడా చేయం. ఆ ఆలోచనే మనకి రాదు. అలాగే వీరూను. వారికి సరిగ్గా అర్థమయ్యేట్లు చెప్పలేం. వారు మనల్ని అర్థం చేసుకోవాలనుకోరు" అన్నాడు సుకుమార్ బరువుగా నిట్టూరుస్తూ.

"మరి ఇపుడేమిటి చేయడం?" అన్నాడు విజయానంద్ దిగులుగా.

"బాధపడకు, అభివృద్ధి అంతరం ఎంతగానో ఉన్న వీరితో మనం ఇప్పట్లో సంబంధాలు పెట్టుకోలేం కనుక ఇక్కడి నుంచి భూమికి వెళ్ళిపోవడమే మార్గం. ఇంకా మనం ఇక్కడే ఉంటే మనం గినీపిగ్స్ మీద ప్రయోగాలు చేసినట్లు మన మీద పరీక్షలు మొదలుపెడ్తారు అన్నాడు సుకుమార్.

"మరి ఎలా వెళ్ళడం!" అని అడిగాడు విజయానంద్ సుకుమార్ బైనాక్యులర్స్‌లో నుంచి నలువైపులా చూశాడు. సమీపంలో ఎవరూలేరు.

"ఇలా" అంటూ చిన్న చాకు వంటిది తీసి ఏదో బటన్ నొక్కాడు అది బోను ఊచల్ని వెన్నని

కోసినంత తేలికగా నిశ్శబ్దంగా కోసేసింది. ఇద్దరూ బయటపడ్డారు.

సమీపంలో ఉన్న కొన్ని మొక్కల్ని, కొమ్మల్ని, చిన్నచిన్న పురుగుల్ని తీసుకుని తమ నౌకలోకి వెళ్ళారు.

"ఇది లేజర్ కిరణాలను కేంద్రీకృతంచేయడం వల్ల తయారైన కత్తి. ఇది ఎంతటి గట్టి వస్తువులనైనా అవలీలగా కోసివేస్తుంది". అంటూ నౌకలోని యంత్రాలను సరిచేయడం మొదలుపెట్టాడు సుకుమార్.

మరుక్షణంలో ఆ నౌక వారితో సహా కాంతిగా మారిపోయి అనంతాకాశంలో భూమండలం వైపుగా దూసుకుపోయింది.

**ఉదయం దినపత్రిక, ఆగస్టు, సెప్టెంబరు 1993** ✪